# చోటు

ఎడతెరపి లేకుండా వర్షం పడుతూనే వుంది. మూడు రోజులనుండీ పట్టిన ముసురు వదలనంటోంది. ఎప్పుడూ కిటకిటలాడే ఆసుపత్రి బోసిపోయినట్లుంది.

క్రితం రోజు అడపాదడపా వచ్చిన కేసులే కానీ ఈ రోజు పేషెంట్స్ వచ్చే సూచన కనిపించడం లేదు. అప్పటికే మిగతా ఇన్‌పేషెంట్లను చెక్‌చేసి వచ్చిన డాక్టర్ పురిటి పిల్లల విభాగంలోకి వెళ్లాడు.

పెద్ద హాలులో రకరకాల ఇన్‌క్యుబేటర్‌లు వరుసగా అమర్చి వున్నాయి. ఓ పక్కనున్న ఫొటోథెరపీ విభాగం కాంతిమయంగా వుంది. డ్యూటీ నర్సులు తలెత్తకుండా ఒక ఇన్‌క్యుబేటర్ నుంచి మరొక ఇన్‌క్యుబేటర్‌కు పరుగులు తీస్తున్నారు.

పుట్టీపుట్టగానే అప్పుడే విచ్చిన పువ్వుల్లాంటి చిన్నారులు ప్రత్యేక చికిత్సలో వున్నారు. నెలలు నిండకుండానే పుట్టిన పసికందుల్ని ఈ లోకంలో ఇమడ్చడానికి తల్లి తరువాత తల్లిలా ప్రయత్నిస్తోన్న ఆధునిక యంత్ర పరికరాలు నిశ్శబ్దంగా తమ పని తాము చేసుకుపోతున్నాయి. జనన సమయంలో బరువు తక్కువైన శిశువులు, పురిటి జబ్బుల బారినపడ్డ శిశువులు తమ తొలి జీవన పోరాటం చేస్తునారు.

డాక్టర్ డ్రస్సింగ్ రూంలోకి వెళ్లి స్టెరిలైజ్డ్ గౌన్ వేసుకొన్నాడు. చెప్పులు మార్చుకొన్నాడు. చేతులు స్టెరిలియంతో శుభ్రం చేసుకొని లోపలికి నడిచాడు.

ఒక్కో ఇన్‌క్యుబేటర్ దగ్గర ఆగి, ఆ బుల్లి పేషెంట్స్‌ను పరీక్ష చేశాడు. హెడ్ నర్స్ పరిస్థితి వివరిస్తోంది.

ఒకరికి సెలైన్ మరొకరికి ఆక్సిజన్ పెట్టాల్సి వచ్చింది.

డాక్టర్ ఆ పనంతా చకచకా పూర్తి చేశాడు.

ఆ చిన్ని చిన్ని పాపాయిల్ని మరోమారు కలియజూసి, బయటకు నడిచాడు. డాక్టర్ దృష్టి ఓ పక్కగా వున్న క్రిబ్‌పై పడింది.

'బేబీ ఆఫ్ శ్యామల' ఇంకా అక్కడే వుంది.

డాక్టర్ కనుబొమలు ముడిపడ్డాయి.

''సిస్టర్....బేబీ ఆఫ్ శ్యామలను వాళ్ల వాళ్లకు ఇచ్చేయలేదూ?''

''లేదు డాక్టర్ ... ఎవరూ రాలేదు'' హెడ్‌నర్స్ సమాధానమిచ్చింది.

'' ఎవరూ రాకపోవడమేమిటి?'' డాక్టర్ తనలో తను అనుకొన్నట్లుగా అన్నాడు.

''అంతే .... ఎవరూ రాలేదు డాక్టర్''

డాక్టర్ నర్స్‌ను ఎగాదిగా చూసి, తన కన్సల్టేషన్ గదిలోకి వెళ్లి కూర్చున్నాడు.

''రెండు రోజులపైనే అయింది. ఎవరూ రాకపోవడమేమిటి?'' డాక్టర్ మళ్లీ అన్నాడు ''అసలు ....వాళ్లకి విషయం తెలుసుంటుందా?''

''యస్....డాక్టర్! నేనే చెప్పాను. ఆ బేబీ తండ్రనుకొంటా....అతనికి చెప్పాను.''

'' ఏమన్నారు?''

''ఫీజు ఎంత అవుతుందన్నాడు. చెప్పాను టాక్సీ తీసుకొని ఇప్పుడే వస్తానని అదే పోకడ పోయాడు.'' నర్స్ తన తప్పేమీ లేదన్నట్లుగా అంది.

ఇంక నువ్వెళ్లొచ్చును అన్నట్లుగా చూశాడు డాక్టర్.

నర్స్ లోపలికి వెళ్లిపోయింది.

శ్యామల మంజులా నర్సింగ్ హోంలో ప్రసవించింది.

బేబీ ఆఫ్ శ్యామల పుట్టగానే బరువు తక్కువగానూ శ్వాససంబంధమైన సమస్యతోనూ ఉన్నట్లుగా గుర్తించిన డాక్టర్‌మంజుల బేబీ ఆఫ్ శ్యామలను ఇక్కడికి పంపించింది.

రాగానే డాక్టర్ పరీక్షించి, ఇన్‌క్యుబేటర్‌లో పెట్టాడు. ఎంతో ప్రయాసపడగా మూడోనాటికి కాస్త కోలుకుంది.

రెండ్రోజుల క్రితం బేబీ ఆఫ్ శ్యామల పరిస్థితి హఠాత్తుగా విషమించింది.

వెంటిలేటర్‌తో కృత్రిమశ్వాస కల్పించినా ఊపిరి నిలువలేదు.

బేబీ ఆఫ్ శ్యామల నిర్జీవమైపోయింది.

డాక్టర్ వెంటనే మంజులా నర్సింగ్ హోంకి ఈ వార్త చేరేసాడు.

బేబీ ఆఫ్ శ్యామల తండ్రి వచ్చాడు. విషయం తెలుసుకొని వెళ్లిన మనిషి ఇప్పటికి అజాపజాలేదు.

డాక్టర్ నిట్టూర్చాడు.

మంజులా నర్సింగ్‌హోంకి ఫోన్ చేశాడు.

శ్యామల వాళ్లు రెండురోజుల క్రితం వెళ్లి పోయారన్న విషయం డా. మంజుల మరోమారు స్పష్టం చేసింది.

డాక్టర్ ఓసారి బేబీఆఫ్‌శ్యామల కేస్‌షీట్ పరిశీలించాడు.

అడ్రస్ స్పష్టంగా లేదు. ఏదో ఊరి పేరు వుంది.

తనకు తెలిసి ఈ చుట్టుపక్కల అలాంటి పేరు ఎన్నడూ వినివుండలేదు. డాక్టర్ మరోమారు డా.మంజులను ఈ విషయమై సంప్రదించాడు. అక్కడా ఇదే పరిస్థితి.

ఆ సాయంత్రానికీ బేబీ ఆఫ్ శ్యామల కోసం ఎవరూ రాలేదు. బేబీ ఆఫ్ శ్యామలను తీసుకువెళ్లడానికి ఎవరూ రారన్నది డాక్టర్‌కు స్పష్టపడింది.

డాక్టర్ బేబీ ఆఫ్ శ్యామలలో వస్తోన్న మార్పుకు గాబరాపడ్డాడు. ఇంక ఆసుపత్రిలో వుంచడం మంచిదికాదు. ఆలస్యం చేయకూడదు.

కుండపోత వర్షం తుఫాన్‌గా మారేట్టుగా వుంది. ఇలాంటి సమయంలో ఆ ఆచూకీ తెలియని ఊళ్లో బేబీ ఆఫ్ శ్యామల సంబంధీకుల కోసం వెతకడం అసంభవం.

''డాక్టర్ గారూ!''

డాక్టర్ ఎదురుగా నిల్చునివున్న నర్స్ వంక ప్రశ్నార్థకంగా చూశాడు.

''బేబీ ఆఫ్ శ్యామల విషయం...''నసుగుతూ అంది నర్స్.

ఏం చెప్పాలనుకొంటుందో వినడానికి సిద్ధంగా వున్నట్లు డాక్టర్ తలాడించాడు.

'' ఇంతకుమునుపు నేను గైనికాలజిస్ట్ దగ్గర పని చేసేప్పుడు ఇలాంటి వాటిని ఏం చేసేవాళ్లమో చెప్పమంటారా డాక్టర్''

'' ఏం చేసేవాళ్లు?''

'' ఏవుందీ...రైలుకట్ట అవతల తుప్పల్లో పడేయడమే!''

డాక్టర్ మొహం అప్రసన్నంగా పెట్టాడు.

'' ఓ రిక్షావాడిని పిలిచి, పదోపరకో చేతిలో పెడితే సరి. నిమిషాల్లో

పనయిపోతుంది'' హుషారుగా అంది నర్స్.

కాస్త ఆలోచించి ఆ పనేదో నర్స్‌నే చేయమన్నాడు డాక్టర్. నర్స్ వడివడిగా వెళ్లింది.

రోడ్డుకు అవతల ఒకటో రెండో రిక్షాలున్నాయి. వాటికి ముందు పరదాలు బిగించి వున్నాయి.

వర్షం హూరులో నర్స్ కేకలు ఎప్పటికో వినిపించి, ఓ రిక్షావాడు నెమ్మదిగా ఆసుపత్రి ముందుకు వచ్చాడు.

నర్స్ అతడికి పరిస్థితి వివరించింది. రిక్షావాడు డాక్టర్‌తోనే మాట్లాడతానన్నాడు.

ముసుగులో గుద్దులాటలొద్దని నిక్కచ్చిగా తేల్చేసిన డాక్టర్‌తో మూడువందలిస్తే ముక్కు మూసుకొని పడేసి వస్తానన్నాడు రిక్షావాడు.

డాక్టర్ కళ్లు . బైర్లు కమ్మినంత పనయ్యింది. పట్టుమని పదిబారలు లేని రైల్వేలైను దగ్గరికి వెళ్లడానికి మూడు వందలా?

డాక్టర్‌కు బేబీ ఆఫ్ శ్యామల కోసం పడిన శ్రమ, పెట్టిన ఖర్చు గుర్తొచ్చాయి. ఫీజు కట్టకుండా మొహం చాటేసిన పెద్దమనిషి గుర్తొచ్చాడు.

శ్రమకి శ్రమ ఖర్చుకి ఖర్చు, మళ్లీ పైనుంచి ఇదొకటా? డాక్టర్‌కు మనసొప్పలేదు.

రిక్షావాడు తగ్గలేదు. వర్షాల మూలంగా నయాపైసా ఆదాయం లేకపోవడంతో ఈ అవకాశాన్ని చేజారనివ్వదలుచుకోలేదు.

అలా చేయడంవలన తనకు పాపం చుట్టుకుంటుందనీ అయినా డాక్టర్‌గారి కోసం తానా పని చేయాలని నిర్ణయించుకొన్నానని రిక్షావాడు తన సహృదయతను చాటాడు.

ఏమైనా కానీ అంత డబ్బు ఇవ్వడం కుదరదని డాక్టర్ ఖచ్చితంగా చెప్పేసాడు.

రిక్షావాడు మరోసారి పిలిచినా రానని హెచ్చరించి వెళ్లిపోయాడు.

నర్స్ నిస్సహాయ ప్రేక్షకురాలే అయింది. ఇక డాక్టర్ తప్పక ఆ పనిని తనకే అప్పజెపుతాడని డాక్టర్ ఎదురుగా నిలబడకుండా లోపలికి వెళ్లిపోయింది.

ఆవేశం తగ్గాక డాక్టర్‌కు కర్తవ్యం తట్టింది.

నెంబరు వెతికి, మున్సిపాలిటీ ఆఫీస్‌కు ఫోన్ చేశాడు. లాభంలేదు ఎన్నిమార్లు చేసినా, ఎన్నిసార్లు ప్రయత్నించినా ఒకటే ఫలితం. ఎవరూ ఫోన్

ఎత్తుకోవడంలేదు.

ఈ తుఫాన్‌లో ఏ వెర్రివాడు వచ్చి ఆఫీస్‌లో కూర్చుంటాడు? డాక్టర్ గొణుక్కున్నాడు.

ఎంతయినా ప్రభుత్వ కార్యాలయం ఎవరో ఒకరు వుండకపోతారా? డాక్టర్ మళ్లీ ప్రయత్నించాడు.

చివరకు తనే తీసుకెళ్లి వాళ్లకు అప్పగిస్తే ఎలా వుంటుందన్న ఆలోచన వచ్చింది. కానీ తీసుకెళ్లడం ఎలా?

మళ్లీ నర్స్ సాయానికి వచ్చింది.

"ఆ మధ్యనో సినిమాలో... ఆ గుర్తొచ్చింది! పుష్పకవిమానంలో కమల్ ఏం చేస్తాడో తెలుసా డాక్టర్?" ముసిముసి నవ్వులు నవ్వుతూ అంది నర్స్.

డాక్టర్‌కు చిరాగ్గా వుంది. అదేదో సినిమాలో అతనెవరో ఏం చేస్తే తనకెందుకు? ఇప్పుడు తనేం చేయాలో తోచక చస్తుంటే!

నర్స్ తన ధోరణిలో తను చెప్పుకుపోతోంది.

"...ఆ తరువాత చక్కగాగిఫ్ట్ ప్యాక్ చేసిసెంట్‌స్ప్రే చేసి ఓ బస్‌స్టాప్‌లో..."

డాక్టర్ విసుగ్గా మొహం చిట్లించాడు.

నర్స్ మాటలు మింగేసింది. కాసేపటి తరువాత మళ్లీ తనే చెప్పుకొచ్చింది.

"బేబీ ఆఫ్ శ్యామలను కూడా ఓ మంచి అట్టపెట్టెలో పెట్టి, ఏ బస్‌స్టాప్‌లోనో వదిలేస్తే సరి!" నర్స్ తేల్చేసింది.

డాక్టర్‌కు ఇది సమంజసంగానే వున్నట్లుగా తోచింది.

ఎలాగూ తను ఖాళీగా వున్నాడు. వాడినీ వీడినీ బతిమిలాడడం దేనికి? చేయాల్సిన పనేదో తనే చేస్తే పోలా? అందులోనూ వర్షంలో కారులో కూర్చుని ఊరిని చుట్టేయడం సరదాగా వుంటుంది.

డాక్టర్ తన పాత మోడల్ మారుతికారును బయలుదేరడానికి సిద్ధం చేశాడు. నర్స్ చక్కగా ప్యాక్ చేసిన బేబీ ఆఫ్ శ్యామలను కారు వెనుక సీట్లో పెట్టింది.

డాక్టర్ కారు అద్దాలన్నీ బిగించాడు. మొత్తానికి బేబీ ఆఫ్ శ్యామలకు ఆరడుగులు...కాదు... కాదు... అడుగున్నర చోటుకోసం ప్రయాణం మొదలయ్యింది.

దట్టంగా వున్న వర్షధారల్ని చీల్చుకొంటూ, రోడ్డుమీద అడుగున్నర ఎత్తున

నీటిలో గుంటల్లో పడకుండా లాఘవంగా తప్పించుకొంటూ డ్రాక్టర్ కారు సాగిపోతోంది.

డ్రాక్టర్ తిన్నగా మున్సిపాలిటీ ఆఫీస్‌కెళ్లాడు. గేట్లు లేని కాంపౌండ్‌ను దాటి ఆఫీస్ గదుల ముందు ఆగాడు.

కారులో కూర్చుని ఎక్కడైనా మనుషుల కదలికలు కనిపిస్తాయేమోనని వెతికాడు. ఎవరూ వున్న జాడే లేదు.

డ్రాక్టర్ అసహనంగా కారు హారన్ మోగించాడు.

ఎంతసేపటికి ఎవరూ అటు రాలేదు. చివరకు పరీక్షగా చూసిన డ్రాక్టర్‌కు తలుపులకు వేల్లాడుతోన్న తాళం అస్పష్టంగా కనిపించింది. డ్రాక్టర్ నిరాశగా వెనక్కి తిరిగాడు. వరుసగా నిలిపివున్న మున్సిపాలిటీ వ్యాన్లు, ట్రాక్టర్లను దాటుకుంటూ బయటకు వెళ్లాడు. కథ మళ్లీ మొదటికి వచ్చింది.

డ్రాక్టర్‌కు నర్స్ సలహా గుర్తొచ్చింది. రైల్వే లైను తుప్పలు-అంతలోనే పోలీసులు కేసులు గుర్తొచ్చాయి.

బేబీ ఆఫ్ శ్యామలను వాళ్ల సంబంధీకులకు అప్పజెప్పడం తన ధర్మం కానీ వాళ్లే అనాధగా వదిలినపుడు తన నేరం ఏముంది? ఒక ఆరోగ్య సంరక్షకుడిగా ఇలాంటి స్థితిలో వున్న శిశువుకు తన ఆసుపత్రిలో చోటు ఇవ్వగలడా? ఎప్పుడో వాళ్లు వచ్చేవరకూ బేబీ ఆఫ్ శ్యామలను వుంచడం ఎలా వీలవుతుంది?

ఇంతటి వానలో వాళ్లు రావడం అసాధ్యం ఇక మున్సిపాలిటి వాళ్లు వస్తారన్న ఆశ అసలే లేదు.

డ్రాక్టర్ ఆలోచిస్తూనే కారును నెమ్మదిగా రైల్వే లైను వైపు నడిపించాడు. రైల్వేలైను రెండు వైపుల ఏవో ముళ్లచెట్లు, తుంగచెట్లు గందరగోళంగా వుంది. ఇక కారు అద్దాలు తీసి, ఆ పాకెట్టును విసిరేసి వెళ్లొచ్చు. కానీ డ్రాక్టర్‌కు లోలోన ఏదో జంకు కలిగింది.

బేబీ ఆఫ్ శ్యామల తల్లిదండ్రులొస్తే? ఏం సమాధానం చెప్పాలి? డ్రాక్టర్ తనకే తను సర్ది చెప్పుకొన్నాడు.

కన్నబిడ్డ కన్నుమూసిందన్న విషయం తెలిసీ తెలియనట్లు ఊరుకొన్న వారి బాధ్యతారాహిత్యానికి ఫలితం ఏమిటో కూడా తెలియద్దూ?

ఇంతలో తుప్పల్లోంచి విసురుగా దూసుకొచ్చాయేవో ఆకారాలు. వచ్చినంత వేగంగా కారు మీద దాడిచేశాయి.

డాక్టర్ పై ప్రాణాలు పైనే పోయినంత పనయ్యింది.

డాక్టర్ కాస్త నిభాయించుకొని వాటివైపు చూశాడు. వర్షాన్ని లెక్కచేయకుండా కాట్లాడుకొంటోన్న కుక్కల గుంపు విన్యాసం అది.

ఆ కుక్కల పళ్లు పదును మీదున్న చురకత్తుల్లా తళతళ మెరుస్తున్నాయి. డాక్టర్ కారు మీదినుంచి గెంతుతూ, కారుకింద నుంచి దూరుతూ ఒకదాన్ని ఒకటి తరుముకుంటున్నాయి.

వీటికి దూరంగా మరో రెండు గబగబ దేన్నో లాక్కురావడం డాక్టర్ కళ్లబడింది. డాక్టర్ ఆ వైపు పరీక్షగా చూశాడు.

ఒక డాక్టర్‌కు అదేవిటో గుర్తించడం అంత కష్టమేమీ కాదు.

ఎవరిదో అబార్టెడ్ ఫీటస్!

తాజా రక్తం ఆ కుక్కల మూతికి అంటుకొని వుంది. నరాలు పళ్ల సందుల్లోంచి వేల్లాడుతున్నాయి.

డాక్టర్ ఒళ్లు జలదరించింది.

తను ఆ ప్యాకెట్ ఇక్కడ వదిలి వెళ్లగానే బేబీ ఆఫ్ శ్యామలకు పట్టేగతి.. ఇదేనన్న సత్యం డాక్టర్‌కు రుచించలేదు.

ఆ బలిష్టమైన కుక్కలు ఒక్కసారిగా బేబీ ఆఫ్ శ్యామలపై దాడిచేసి చీల్చి చెండాడి...

డాక్టర్ కడుపులో దేవినట్లయింది.

ఇన్‌క్యుబేటర్‌లో పెట్టిన నాటినుండి పాలుపట్టి న్యాపీస్ మార్చి ప్రతిక్షణం కంటికి రెప్పలా జాగ్రత్తగా చూసుకొన్న చిన్ని శరీరాన్ని అలా వదిలేయడానికి డాక్టర్‌కు మనసొప్పలేదు.

ఏ తల్లి కన్నబిడ్డో తమ సంరక్షణలో వారం రోజులుంది. అలాంటిది తను నిర్దాక్షిణ్యంగా ఆ కుక్కల గుంపు మధ్య ఎలా విసిరేయగలడు? ఇది సరైన చోటు కాదు.

డాక్టర్ కారుని అక్కడికి దూరంగా పోనిచ్చాడు.

కాస్త ముందుకు వెళ్లాక డాక్టర్‌లో మరో ఆలోచన తలెత్తింది.

అక్కడే అలా వుందేమో! మరోచోట ఇలాంటి కుక్కలు వుండవేమో!

రైల్వేలైను పక్కన ఎక్కడ చూసినా ఏదో బొమిక కనిపిస్తూనే వుంది. కుయ్యోమొర్రో మంటోన్న కుక్క ఎదురొస్తూనే వుంది.

రైల్వేలైను అసలు తగిన చోటు కానేకాదు. డాక్టర్ అసంతృప్తిగా అనుకొన్నాడు. డాక్టర్‌కు ఆ వుదయం పెన్నానదిలో నీరు వెల్లువెత్తిందని చెప్పుకోవటం గుర్తొచ్చింది.

తన చిన్నపుడు ఎపుడోకానీ ఈ మధ్యకాలంలో పెన్నాలో ఇసుక తిన్నెలు తప్ప నీటిప్రవాహం చూసి ఎరగడు. పెన్నాను చూసినట్లూ వుంటుంది. బేబీ ఆఫ్ శ్యామలను వదిలినట్లు వుంటుంది.

డాక్టర్ నేరుగా పెన్నా బ్రిడ్జి మీదికి వెళ్లాడు.

అంత వర్షంలోనూ పెన్నాని చూడడానికి జనం విరగబడి వున్నారు. డాక్టర్ కారుని నిలపడానికే స్థలం దొరకలేదు. డాక్టర్ కారును నెమ్మదిగా ఆ చివరికి పోనిచ్చాడు.

పరవళ్లు తొక్కుతోన్న పెన్నామీద ధారాపాతంగా పడుతోన్న వర్షం తమాషాగా వుంది. బ్రిడ్జి మీద చేరినవారి కేరింతలు వర్షపు హోరును మించి వున్నాయి.

డాక్టరు నదీ ప్రవాహాన్నే చూస్తూ వుండిపోయాడు.

ఓ గుడిసె కప్పు నీళ్ల మీద తేలుతూ వచ్చింది.

తను బేబీ ఆఫ్ శ్యామలను నీళ్లలో వదలగానే అలాఅలా అలలపై ఉయ్యాలలూగుతూ సాగిపోతుందేమో. డాక్టర్ గుడిసెకప్పు కనుమరుగయ్యేంత వరకూ అటే చూస్తూండిపోయాడు.

ఇంతలో నీటిలో ఏదో మునిగితేలడం డాక్టర్ దృష్టిలో పడింది. డాక్టర్ పరిశీలనగా చూశాడు.

మానవహస్తం ప్రాణ రక్షణకై అర్థిస్తున్నట్లుగా వుంది.

డాక్టర్ సహాయానికి వెళ్దామని నిర్ణయించుకొనే లోపలే ఎవరో నీళ్లల్లోకి దూకి ప్రవాహానికి ఎదురొడ్డి ఆ మనిషిని ఒడ్డుకులాగారు.

మానవత్వం బతికి వున్నందుకు డాక్టర్ ఎంతో సంతోషించాడు.

తన కర్తవ్యంగా ప్రథమ చికిత్స చేయడానికి ఫస్ట్ ఎయిడ్ బాక్స్ సరిచూసుకొని అటువైపు కారు మళ్లించాడు.

అక్కడికి చేరేలోపలే ఓ నగ్నసత్యం డాక్టర్ కళ్లబడింది.

ఆ మనిషిని బయటకు లాగిన వ్యక్తి ఆమె వంటిమీది బంగారాన్ని చివరకు చీరను కూడా వలుచుకొని ఆమె గిలగిలలాడుతోన్నా పట్టించుకోకుండా నిర్దాక్షిణ్యంగా నీళ్లలోకి తోసేసి తన దారిన తను చక్కాపోయాడు.

డాక్టర్ చూస్తుండగానే ప్రవాహవేగంలో ఆమె ఆకృతి కలిసిపోయింది. డాక్టర్ మెదడు మొద్దుబారిపోయింది.

రైల్వేలైను దగ్గరున్న కుక్కలు డాక్టర్ మనసులో మెదిలాయి. అవి కనీసం చచ్చేదాకయినా ఆగుతాయేమో! ఇలాంటి చోటేనా తను బేబీ ఆఫ్ శ్యామలను వదిలేది?

డాక్టర్ వెనుక సీటువైపు చూశాడు.

బేబీ ఆఫ్ శ్యామల అందమైన పెట్టెలో నిశ్చింతగా ఒదిగివుంది.

ఆ ఆకర్షణీయమైన ప్యాకింగ్ చూసి ఏదో దొరుకుతోందన్న ఆశతో..బేబీ ఆఫ్ శ్యామలను కుక్కలకన్నా హీనంగా ఈ మనుషులు.. డాక్టర్ ఇంక ఆలోచించదలుచుకోలేదు. తిన్నగా ఆసుపత్రికి వెళ్లాడు.

గుమ్మంలోనే ఎదురొచ్చిన నర్స్‌కు బేబీ ఆఫ్ శ్యామలను అందించాడు డాక్టర్. ఆమె అయోమయంలోంచి తేరుకొని ఏదో అడిగే లోపలే తన గదిలోకి వెళ్లాడు.

నర్స్ బేబీ ఆఫ్ శ్యామలతో సహా డాక్టర్‌ను అనుసరించింది.

డాక్టర్ ఓ చిన్ని శరీరాన్ని పారేయలేని తన అశక్తతను అంగీకరించి నర్స్‌నే ఏదో ఒకటి చేయమని చెప్పాడు.

నర్స్ మౌనంగా గది బయటకు వెళ్లింది.

డాక్టర్ కుర్చీలో వెనక్కు వాలి, నుదురు వత్తుకొంటూ కూర్చున్నాడు.

డాక్టర్ కళ్లముందు కదులుతున్న దృశ్యాలు డాక్టర్‌ను ప్రశాంతంగా వుండనివ్వడంలేదు.

డాక్టర్ బలవంతంగా ఏదో విషయంవైపు మనసు మరల్చడానికి ప్రయత్నం చేశాడు. లేచి పురిటి పిల్లల విభాగంలోకి వెళ్లాడు. ఇంక్యుబేటర్స్‌లో వున్న పసికందుల్ని చూశాడు.

బేబీ ఆఫ్ శ్యామలను కూడా ఇంత జాగ్రత్తగా ఇంత అపురూపంగానేగా చూశాము. డాక్టర్ నిట్టూర్చాడు.

డాక్టర్ మళ్లీ వెళ్లి తన కుర్చీలో కూర్చున్నాడు.

ఇంతలో నర్స్ వచ్చింది. డాక్టర్ వాలకం చూసి కాసేపు తటపటాయించింది. నర్స్ మొహమాటం గమనించి డాక్టర్ విషయం ఏమిటని ఆరా తీశాడు.

''బేబీ ఆఫ్ శ్యామల కోసం ఎవరో వచ్చారు డాక్టర్!''

''వ్వాట్'' డాక్టర్ అప్రయత్నంగా చిన్నకేక పెట్టాడు, '' ఇంత నెమ్మదిగానా చెప్పేది! వెంటనే లోపలికి పంపించు''

నర్స్ వేగంగా బయటకు వెళ్లి, ఓ యువతిని వెంట బెట్టుకొచ్చింది.

డాక్టర్ ఆ యువతిని పరిశీలనగా చూశాడు.

మనిషి నీరసంగా వుంది. మాట ఎక్కడి నుంచో వస్తున్నట్లుగా వుంది. చెవుల్లోంచి తొంగి చూస్తోన్న దూది ఆమె బాలింతరాలని చెప్పకనే చెపుతోంది.

బహుశా ఈవిడే శ్యామల అయివుండవచ్చును. ఆవిడ శ్యామలే!

కన్నబిడ్డపట్ల వారి నిర్లక్ష్యవైఖరి గుర్తొచ్చి డాక్టర్‌కు ఒక్కసారిగా కోపం ముంచుకొచ్చింది.

డాక్టర్ ఏమీ అనకముందే డాక్టర్ అనాలనుకొన్న ఆ నాలుగు మాటలు నర్స్ అనేసింది. అలా వదిలేయడానికి మనసెలా ఒప్పిందని చెడామడా కడిగేసింది.

నర్స్ ధాటికి పేలవంగా వున్న ఆమె మొహం మరింత పాలిపోయింది. ఎండిన కొలనుల లాంటి ఆమె కన్నుల్లో నీళ్లు చిప్పిల్లాయి.

డాక్టర్ మనస్సు చివుక్కుమంది.

నర్స్‌ను వారించి, బేబీ ఆఫ్ శ్యామలను ఆమెకు అప్పగించమన్నాడు.

నర్స్ గబగబా లోపలికి వెళ్లింది.

ఆమె నిర్ప్రాణగా నిలబడి వుండిపోయింది. కాసేపటికి తనలోతను గొణుక్కున్నట్లుగా అంది.

''పుట్టబోయేది పాప అని తెలిసిన రోజే ఆయన వాలకం మారిపోయింది. పుట్టే అవతారానికి తిండికూడా దండగని కట్టడి చేస్తే నా కన్నీళ్లతోనే కడుపు నింపుకొని నిండు నెలలు కాపాడుకొన్నాను. చివరికి పాప బరువు తక్కువగానూ అనారోగ్యంగానూ పుట్టింది. పాప కోలుకోవాలని నాకెంత ఆశగా వుండేదో! పిచ్చిదాన్ని కాకపోతే అమ్మ ఆశ అమ్మాయికి ఆయువు పోస్తుందా? ఆఖరి కి స్థితిలో శ్మశాన ఖర్చు కూడా శుద్ధ దండగని నాతో మాట మాత్రం చెప్పకుండా ఆయన..'' ఆమె కంఠం పూడుకుపోయింది.

ఆమె నోట్లో మాట నోట్లో గొణుక్కుంటూ నర్స్ అందించిన పాపను జాగ్రత్తగా అందుకుంది. ఆ ఆయువులేని ఆకారాన్ని పొదివి పట్టుకొంది. గుండెలకు హత్తుకొని నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకొంటూ బయటకు వెళ్లింది.

మెల్లిగా కనుమరుగవుతోన్న బేబీ ఆఫ్ శ్యామలను చూస్తోన్న డాక్టర్ పెదవులు వణికాయి.

''పాపకు చోటుకోసం వెతకాల్సింది ఈ విశాల ప్రపంచంలోనే కాదు.. పిడికెడు హృదయంలో కూడా!''

విపుల జూన్ 1996